# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక

శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com

**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ

సంపుటి 40 సంచిక 5

పేజీలు 44

జనవరి 2021

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్, A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి.

M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD

**ఈ సంచికలో ........................ ....... పేజీ**

దాశరథీ శతకము ........ 4
శ్రీబాబూజీ ఉవాచ........ 5
శివార్చన ........ 7
అమ్మమాట........ 8
వినుము వినుము వినుము కాళీప్రసాదా ........ 9
హైదరాబాద్ శాఖలో కార్యక్రమాలు........ 10
అగస్త్య హృదయం ........ 11
అమ్మతో మాట ........ 13
మదాలస ........ 15
రామాయణంలో స్త్రీ పాత్రలు........ 17
బాబూజీతో అనుభవాలు ........ 19
నీచం ........ 21
కరోనా బోధించిన పాఠం ........ 25
మధురం మధురం మధురం ........ 27
శ్రీ కృష్ణజన్మాష్టమి ........ 29
శ్రీబాబు దివ్యవాణి ........ 30
కైవల్యోపనిషత్ ........ 32
శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు........ 34
ఉడిపి కృష్ణ మహాత్మ్యం........ 35
శ్రీ నృసింహ యోగీంద్రులు ........ 37
సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర..... 39
విష్ణు కథలు ........ 41

# దాశరథీ శతకము

- భద్రాచల రామదాసు

**ఆర్యుల కెల్ల మ్రొక్కివిన తాంగుడనై రఘునాధ భట్టరా**
**చార్యుల కంజలెత్తి కవి సత్తములన్ వినుతించి కార్యసా**
**కర్య మెలర్పనొక్క శకంబొన గూర్చి రచింతునేడుతా**
**త్పర్యమునన్ గ్రహింపుమిది దాశరథీ కరుణాపయోనిధీ!**

పెద్దల కందరికీ మ్రొక్కి, వంచిన శరీరము గలవాడనై గురువైన రఘునాధ భట్టునకు నమస్కరించి, కవిశ్రేష్ఠులను పొగడి, కార్య లాభమునకై ఒక శతకము వ్రాసెదను. దీని నిష్ఠతో గైకొనుము దాశరథీ కరుణాపయోనిధీ!




*పాణిగ్రహణ సమయంలో రాముడు వేరేవైపుకి ఎందుకు చూస్తున్నాడు?

*మహాభారత యుద్ధంలో ఏ రోజు ఎంత మంది చనిపోతారో ముందుగానే ఎలా తెలిసేది?

*అలర్కుడికి తల్లి ఇచ్చిన ఉంగరంలో ఏమున్నది?

*అల్లూరి సీతారామరాజు వలె సిద్ధులు సాధించాలని బయలుదేరి యోగిగా మారినది ఎవరు?

*విదురుడు అన్ని పండుగలు ఒకేసారి వచ్చిన ఆనందం ఎందుకు పొందాడు?

*జనకుడు సీతమ్మచేతిని తన చేతిలో పెట్టినప్పుడు రాముడు ఎందుకు చేయి వెనక్కి తీసుకున్నాడు?

***సమాధానాలు లోపలి పేజీలలో...........................***

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

28-9-1980.

ఈరోజు ఉదయం శ్రీ బాబూజీ వ్యాహ్యాళిలో మమ్మల్ని ఒక ప్రశ్న వేశారు. "మనము పుట్టినది మొదలు మనలో మార్పులేనిది ఒకటి వుంది అది ఏది?" అని అడిగారు.



ఆత్మ అని ఒకరు, తేజస్సు అని ఒకరు చెప్పాము.

అది మీరు దర్శించారా? అని అడిగారు.

లేదు అని చెప్పాము.

"సోఽహం అంటే ఏమిటి?"

"అనుక్షణం నీలో ఉచ్ఛ్వాస నిశ్శ్వాసాలు జరుగుతాయి. అవి మార్పు చెందుతాయా?" అని అడిగారు శ్రీ బాబూజీ.

అవి మార్పు చెందవు అని చెప్పాము.

"పరిణామముతో కూడినది జగత్తు. పరిణామము లేనిది ఆత్మవస్తువు. పరిణామము లేనిది, పరిణామమున్న అనిత్యమైన దానిని ప్రకాశింపజేస్తోంది" అన్నారు శ్రీ బాబు.

శ్రీబాబు ఇంకా మాట్లాడుతూ "కాని మానవుడు పరిణామముతో కూడిన జగత్తునే ప్రేమిస్తున్నాడు. జగత్తులోని ప్రేమ కలుషితమైనది, కళంకమైనది, కామముతో కూడినది. దీనిలోని ఆనందం క్షణికమైనది. కామములో ఏమి ఆనందం ఉంది? అది దుర్గంధ పూరితమైనది. అసహ్యమైనది. అయినా ఈ ఆనందం కోసమే మానవుడు పరితపిస్తాడు.

కబోదిపక్షులు ఎండమావుల వెంబడి నీటి అన్వేషణ కోసం పోతాయి. ఎండమావుల వెంబడి ఎంత దూరం వెళ్ళినా దాహం

తీరుతుందా?

అయితే ముక్తి కాంతతో జరిపే రతిలో ఎంత ఆనందం ఉంది? అది శాశ్వతానందం. ఆ ఆనందాన్ని పొందినవాడు ఇంక ఏ ఆనందాన్నీ కోరడు. మనస్సు ముక్తికాంతతో రతి జరిపే సమయంలో బాహ్యేంద్రియాలు, అంతరింద్రియాలు అన్నీ దానిలోనే లయించి పోతాయి. అప్పుడు గుణత్రయాలు, ఈషణత్రయాలు మిగలవు.

మనోలయమైనపుడు తానెవరో తాను తెలుసుకుంటాడు. అదే **సోऽహం** భావన. **సోऽహం** అనేది మార్పులేనిది. తానెవరో తాను తెలుసుకున్న వాడికి ఆనందమే మిగులుతుంది. అది గురుదేవుల అనుగ్రహం ద్వారానే తెలుసుకోగలుగుతాడు.

గురుదేవుడు సాగరం వంటివాడు. నదీజలాలు ఎంత వేగంగా వచ్చినా సరే సముద్రంలో లయించిన తర్వాత ఏమీ ఉండదు. సముద్రము ఎప్పుడూ ఒకే రీతిగా ఉంటుంది. ఎంత నదీజలాన్నైనా తనలో చేర్చుకుంటుంది. ఎంత చేరినా ఉప్పొంగదు.

అలాగే జ్ఞాని పొగడ్తలకు ఉప్పొంగడు. దూషణలకు దుఃఖించడు. అన్నింటికి అతీతంగా ఉండి, అన్నింటికీ ప్రకాశాన్ని ఇస్తాడు" అన్నారు.

భగవంతుణ్ణి కోరికలతో పూజించరాదు. సత్ఫలితాలు కోరువారు నిష్కామంగానే ధ్యానించాలి.

వాసనా రహితం వాసుదేవ సందర్శనం!

నిన్న రాదు, రేపు లేదు, ఉన్నది నేడే! కనుక అనవసరమైన ఆలోచనల ప్రవంతికి ఆనకట్టవేయండి. సత్సాంగత్యం, సద్గురు సమాగమం, సత్యం, ప్రేమ, ప్రభుచింతనలతో మనస్సును ఋజు మార్గంలో పెట్టండి. ప్రాపంచిక మోహాన్ని పరమాత్మపైకి మళ్ళించండి. ప్రశాంతత లభిస్తుంది. పరమాత్మ అనుగ్రహం మీపై తప్పక వర్షిస్తుంది.

-శ్రీ కాళీప్రసాదబాబు

# శివార్చన

సేకరణ - బొంబాయి కృష్ణారావు

మహాదేవా! నీ అభిషేకానికి నీళ్ళు తీసుకుని గుడి మెట్లు ఎక్కాను. పవిత్ర గంగ నిన్ను ప్రతిక్షణం అభిషేకిస్తుందని మరచిపోయాను!

మహాదేవా! హాలాహలం వేడితో నువ్వు తపిస్తున్నావని, మంచి గంధలేపనం వేద్దాం అనుకున్నాను. చల్ల దనానికి ప్రతిరూపమైన హిమ శిఖరమే నీ వాసం, నీ శిరస్సే శశాంకుడి నివాసం అని మరచిపోయాను!

మహాదేవా! మణిమాణిక్యాలతో నిన్ను పూజిద్దామనుకున్నాను. ఫణిరాజు అయిన వాసుకి నీ మెడలో కంఠాభరణం అని మరచి పోయాను!

మహాదేవా! వేద స్తోత్రాలతో నిన్ను స్తుతిద్దామనుకున్నాను. వేదాలనే చెప్పిన ఆదిగురువు దక్షిణామూర్తివి నీవే అని మరచిపోయాను!

మహాదేవా! కమ్మని సంగీతంతో నిన్ను పరవశింపచేద్దా మనుకున్నాను. సంగీతానికి బీజమైన ఓంకారం నీ ఢమరుక నాదమేనని మరచిపోయాను!

మహాదేవా! శాస్త్రీయ నాట్యంతో నిన్ను అలరిద్దాం అనుకున్నాను. నాట్యానికే ఆచార్యుడవైన నటరాజు నువ్వే అని మరచిపోయాను!

మహాదేవా! షడ్రుచులతో నీకు నైవేద్యం పెట్టి మురిసిపోదాం అనుకున్నాను. అందరికీ ఆహారాన్నిచ్చే అన్నపూర్ణయే నీ అర్ధశరీరం అని మరచిపోయాను!

మహాదేవా! ఉపచారాలతో నీకు సేవ చేసే భాగ్యం పొందుదాం అనుకున్నాను. శిలాదుడి పుత్రుడైన బసవ నందీశ్వరుడు నీ వద్దే వున్నాడని మరచిపోయాను!

మహాదేవా! ఇక నిన్ను ఎలా పూజించాలో, ఎలా సేవించాలో తెలియడం లేదు ప్రభూ! నాది అంటూ ఏమున్నది నాలో? నాలో వెలుగుతున్న జ్యోతి నాదికాదు. నాది అని భ్రమించే దేహం నాది కాదు. నాది అనుకునే 'నా అహం' నాది కాదు. నాలో చెలరేగుతున్న భావాలు కూడా నావి కాదు.

సత్యం తెలిసింది. **అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ!**

# అమ్మమాట

- జపమాల ప్రసాద

## ఒకటికే విలువ

**ఏకమేవాఽ ద్వితీయం బ్రహ్మ** అని చెబుతోంది మహావాక్యం. ఉన్నది ఆ పరబ్రహ్మ వస్తువు ఒక్కటే. అసలు 'వస్తువు' అంటే బ్రహ్మవస్తువే అని చెబుతోంది వేదాంతం. ఆ ఒక్కటీ వుంటేనే సున్నలన్నింటికీ విలువ. సకల చరాచర సృష్టి అంతా కూడా సున్నయే. సున్నకి ముందు ఒకటి (1) అనే చైతన్యం వుంటేనే దానికి విలువ వస్తోంది. ఆ ఒకటి (1) ప్రక్కన ఎన్ని సున్నలు పెట్టినా, వాటి అన్నింటికీ విలువ వస్తోంది. ఆ ఒకటి తీసివేస్తే ఆ సున్నలకి విలువ లేదు. ఆ ఒక్కటి అయిన చైతన్యం తాను స్వయం ప్రకాశమై సమస్త చరాచర జీవ కోటిని ప్రకాశింపజేస్తోంది. ఆ ఒక్క దానినే 'సత్తు' అనీ, 'చైతన్య'మనీ, 'పరమాత్మ' అనీ, 'ఆత్మవస్తువు' అనీ అనేక పేర్లతో పిలువబడుతోంది. **'ఏకం సత్ విప్రాః బహుధా వదంతి'**.



అనేకత్వాన్ని ఆశ్రయిస్తే ఆనందం లేదు. కానీ, అనేకత్వంతో ప్రకాశిస్తున్న ఏకత్వాన్ని గుర్తించి, ఆశ్రయిస్తే ఆనందం దొరుకుతుంది. మన మనస్సుకి సత్తానిచ్చేది కూడా ఆ చైతన్యమే. ఆ మనస్సుని బాహ్య విషయాదులపైకి పరుగు పెట్టనీయకు. అంతర్ముఖం చేస్తే ఆనందం మనలోనే వున్నదని గుర్తించగలుగుతాము. మన మనస్సుని అంతర్ముఖం చేసే మార్గం కేవలం సత్యగురుదేవుడు మాత్రమే చూపగలరు. ఆ గురుముఖస్తుగా వచ్చిన దివ్యబోధను మనస్సు నిండా నింపుకుని, శ్రవణం చేసిన బోధని మననం చేసుకోవాలి. శ్రవణ మననాదులు నిదిధ్యాసకు తీసుకుని వెడతాయి. అదే అనుభవం అంటే.

స్వాతి చినుకు కోసం ముత్యపు చిప్ప నోరు తెరచుకుని వున్నట్లు సాధకుడు గురుబోధామృత వాన కోసం తన హృదయ కవాటాలను ఎల్లవేళలా తెరచుకుని వేచి వుండాలి. చంద్రుని కోసం చకోర పక్షిలాగా, గురుబోధ కోసం సాధకుడయిన శిష్యుడు ఎదురు చూడాలి. 'ఏమో! నా గురుమూర్తి ఏ టైమ్‌కి ఏది అందిస్తారో! స్వామివారి బోధలో నేను

ఆచరించవలసిన పాయింట్ ఎక్కడ దొరుకుతుందో! ఏ సూచన అందిస్తారో! ఏ అనుభవం ప్రసాదిస్తారో!' అని ఎదురు చూడాలి. అక్షరం పొల్లుపోకుండా గురుబోధను శ్రవణం చేయాలి. విన్నది ఒక చెవిలో నుండి విని, మరొక చెవిలో నుండి వదిలిపెట్టకుండా, విన్నది మనస్సు నిండా నింపుకొని, హృదయం నిండా నింపుకుని, హృదయంలో పదిల పరచుకోవాలి. విన్నదానిని ఆచరణలో పెట్టిననాడే ఆనందం లభిస్తుంది.

ఆశ్రమవాసం చేస్తున్నది ఇందుకొరకే. నిరంతరం సచ్చింతన చేయాలి. ఇంద్రియాలను అదుపులో పెట్టుకోవాలి. ఇంద్రియాలన్నింటినీ భగవత్ సేవలో వినియోగించాలి. గురుబోధా శ్రవణం నిర్గుణం. గురువాజ్ఞా పాలన సగుణం. ఈ విధంగా గురుమూర్తిని చతుర్విధ శుశ్రూషలు ఆచరించి కొలిచిన సాధకుడికి మోక్షం కరతలామలకం. అట్టి సాధనకి కావలసిన అఖండ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను ప్రసాదించి సర్వదా గురుపాదుకలు రక్షించుగాక! సుఖీభవ! సుఖీభవ!!

## *వినుము వినుము వినుము కాళీప్రసాదా!*

- పెనుమాక నాగేశ్వరరావు

వినుము వినుము వినుము కాళీప్రసాదా
మా విన్నపము వినవయ్యా కాళీప్రసాదా
నిజము నిజము నిజము కాళీప్రసాదా
మీ దాసాను దాసులమయ్యా కాళీప్రసాదా

శరణు శరణు శరణు కాళీప్రసాదా
మీ శరణార్థులమయ్యా కాళీప్రసాదా
శరణాగత వత్సలుడవుగా కాళీప్రసాదా
కరుణ చూపి కాపాడుమయ్యు కాళీప్రసాదా

జయము జయము జయము కాళీప్రసాదా
జయమంగళమయ్యా కాళీప్రసాదా
శుభము శుభము శుభము కాళీప్రసాదా
నిత్య శుభమంగళమయ్యా కాళీప్రసాదా

# హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**జనవరి 2021**

1 శుక్ర - ఆంగ్ల సంవత్సరాది. సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

8 శుక్ర - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

13 బుధ - భోగి - సా॥ 5-30 గం. శ్రీసద్గురుపాదపూజ. రాత్రి 7గం.లకు శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట.

14 గురు - సంక్రాంతి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

28 గురు - పుష్య పూర్ణిమ - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ, భక్తసమారాధన

**ఫిబ్రవరి 2021**

6 శని - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

16 మంగళ - మాఘ శుద్ధ పంచమి శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠా షష్ఠమ వార్షికోత్సవము(2015 మాఘ శుద్ధ పంచమి)

19 శుక్ర - రథసప్తమి. సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

23 మంగళ - భీష్మ ఏకాదశి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

27 శని - మాఘపూర్ణిమ - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

# అగస్త్య హృదయం

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాళీప్రసాద్ U.S.A

రామాయణం - గురు వైభవం :

శ్రీమద్రామాయణంలో ఆద్యంతమూ గురువుల యొక్క పాత్ర విశేషంగా కనిపిస్తుంది. 'ఋష్యాలవాలోదితః' అంటూ ఋషులనబడే లతలతో అల్లుకొనబడిన కల్పవృక్షంగా రామాయణాన్ని అభివర్ణిస్తారు. బ్రహ్మ మానస పుత్రులైన వశిష్ఠులు ఇక్ష్వాకు వంశానికి మార్గదర్శకులై నడిపించారు. శ్రీమహావిష్ణువే శ్రీరామచంద్రునిగా అవతారం ఎత్తుతారన్న విషయం తెలిసిన ఆయన ఎన్నోవేల సంవత్సరాలు శ్రీరాముని ఆగమనం కోసం నిరీక్షించారని చెప్పబడింది.

ఈ విషయాన్ని వివరిస్తూ శ్రీబాబూజీ 'తప్పటడుగులు వేస్తున్న బాలరాముడిని చూసి కౌసల్యాదేవి ఎంతో మురిసిపోతుండగా, అంతకంటే ఎక్కువగా వశిష్ఠులవారు పొంగిపోయారని శలవిచ్చారు. అదే విధంగా సద్గురుదేవులు పాత్రత కలిగిన శిష్యులకోసం వేచి వుంటారని శ్రీబాబు వివరించారు.

వశిష్ఠులవారే శ్రీరాముని ప్రథమ గురువై సకల విద్యలయందు శిక్షణనిస్తారు. అలా గురుశిష్య సంబంధముతో ఆరంభమై బాలకాండ మొదలు ఉత్తరకాండ వరకూ ప్రతి కదలికలోనూ గురువులు శ్రీరామ చంద్రుని అవతార ప్రయోజనం వైపు నడిపిస్తూనే వుంటారు. మరికొన్ని సందర్భాలలో శ్రీరాములవారే గురువుగా ప్రకాశిస్తూ సీతమ్మవారు, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులూ మరియు హనుమ, జాంబవంత, సుగ్రీవ, విభీషణాదులూ ఆయనను అనుగమించడం (శబరి, అహల్యాదులను శ్రీరాముడు వుద్ధరించడం) కూడా మనకు కనిపిస్తుంది. ఏ విధంగా అన్వయించుకున్నా గురుశిష్యుల అవినాభావ సంబంధం మనకు విశేషంగా దర్శనమిస్తుంది.

విశ్వామిత్రులవారి ఆగమనం, ఆయన ప్రసాదించిన అస్త్ర శస్త్రాదులతో మొదలైన దుష్టశిక్షణ, తరువాత జరిగిన సీతారాముల కళ్యాణ ఘట్టాలు మనందరికీ పరిచయమే. అలాగే అయోధ్యకాండ చివరి

భాగంలో భరద్వాజమహర్షి రాములవారికి చిత్రకూట పర్వతానికి దారిచూపడమూ తరువాత సీతారాములు అత్రి అనసూయ దంపతుల ఆశీర్వాదం తీసుకోవడమూ మనము గమనిస్తాము.

సీతారాములు దండకారణ్యంలో ప్రవేశించడంతో మొదలైన అరణ్యకాండలో వారు ఎంతోమంది మహాత్ములను దర్శిస్తారు. సుమారు 10 సంవత్సరాలు అనేకమైన ఆశ్రమాలను దర్శించి, మునులనూ, ఋషులనూ సేవించిన తరువాత సుతీక్షణులు సీతారామలక్ష్మణులను అగస్త్యులవారి ఆశ్రమమునకు పంపించడము రామాయణములో ముఖ్యమైన మలుపు.

అగస్త్య మహర్షి :

గురుపరంపరలో వచ్చిన అనేకమంది మహాత్ములలో అగస్త్య మహర్షికి విశేషమైన స్థానం వుంది. 'అగ' అంటే కొండ అని అర్థం. మేరుపర్వతానికి ధీటుగా నిలబడి భూమియొక్క సమతౌల్యమును కాపాడిన అగస్త్యులు గురువు తనను నమ్మినవారికి కొండంత అండయై సర్వకాలసర్వావస్థలయందూ కాపాడతారన్న నిదర్శనాలు అగస్త్యులు ఎన్నో చూపించారు.

'మేరు ధీరాయ నమః' అని శ్రీబాబు నామాలలో వివరించినట్లు పంచభూతములను సైతం శాసించి ఆశ్రితులను రక్షించడానికి ఇదొక ఉదాహరణ. దేవాసుర సంగ్రామంలో రాక్షసులు సముద్రంలో దాక్కొన్న సందర్భంలో అగస్త్య మహర్షి సముద్రంలోని నీటినంతటినీ ఒక్క గుటకలో పానం చేసి రాక్షస సంహారానికి దోహదం చేశారు. ఆదిత్య హృదయంతో పాటుగా హయగ్రీవ అవతారములో వున్న నారాయణుని ముఖస్తుగా లలితా సహస్ర నామములను అందించినది కూడా అగస్త్యులవారే. సాక్షాత్తూ పులస్త్య బ్రహ్మకు పుత్రుడై సప్తర్షులలో ఒకరుగా చెప్పబడిన అగస్త్యమహర్షి గురుతత్త్వానికి ప్రతీక అని చెప్పడంలో సందేహం లేదు.

- సశేషం

# అమ్మతో మాట

- సేకరణ నేలభొట్ల ప్రసాద్

ఏంటమ్మా! ఇది. ఎప్పుడూ ఆ ఆదిశంకరులు, కాళీదాసు, మూకశంకరులేనా! కొంచెం మా వంక కూడా చూడవచ్చు కదా! 'ఏంట్రా మీ గోల! మీ వంక చూడకుండానే మీరు పెద్దవాళ్లైపోతున్నారా?' అని ఉరమకు. చూడటమంటే అలా ఇలా చూడటం అని కాదు. పామరుడిని మహాకవిని చేయడానికి, మూగవానితో 500ల పద్యాలు చెప్పించడానికీ నువ్వొక చూపు చూశావే! అదీ, ఆ చూపు చూడాలి.

అమ్మా! అవడానికి అక్షరాలను పుట్టించినది మీ ఆయనే అయినా, నీ చూపు పడకపోతే అవి కదలనే కదలవేమిటమ్మా! ఆ మాటకొస్తే సర్వేశ్వరుడైన నీ మగడే, నీ అనుమతి లేనిదే ఏ పనీ చేయడు. అప్పట్లో హాలాహలం పుట్టి లోకాలన్నిటినీ దహించివేస్తుంటే, పాపం! ఆ దేవతలంతా కలసి మీ ఇంటి ముందు బారులు తీరి....'కుయ్యో! మొర్రో, విను, ఆలింపుము, చిత్తగింపుము, దయన్ వీక్షింపు' అని ఏడుపులు, పెడ బొబ్బలు పెడుతుంటే ..... అప్పుడు కూడా అంతటి బోళాశంకరుడూ వెళ్ళిరానా? అన్నట్లు నీ వంక చూశాడు.

'పాపం! మీ అన్నయ్య ఒక్కడే అక్కడ కష్టపడుతున్నాడు, నేను వెళ్ళి ఆ హాలాహలం సంగతేదో చూస్తే అతను పొంగిపోతాడు' అంటూ నీ పుట్టింటివారి మాటలు నాలుగు చెప్పిమరీ, నిన్ను ఒప్పించి బయలుదేరవలసి వచ్చింది. మరి నువ్వు భర్తను కొంగున ముడివేసుకున్న **'స్వాధీన వల్లభ'**వు కదా!

పుట్టింటివాళ్ళ మాట చెబితే పొంగిపోతావన్న మాట నిజమే కానీ, వాళ్ళైనా మీ ఆయన గురించి ఒక చిన్నమాట తప్పుగా అన్నా, కళ్ళెర్ర జేస్తావు. అసలే నువ్వు **'సదాశివ పతివ్రత'**వు. **'కామేశబద్ధ మాంగల్య సూత్ర శోభిత కంధర'**వు.

మీ నాన్న దక్షుడు నీ మగని నానా మాటలు అంటే, ఆ తరువాత ఏం జరిగిందో మాకు తెలియనిదా! మీ ఆయనకు కూడా నువ్వంటే ఎంత ప్రేమో కదా! నువ్వు నవ్వితే తబ్బిబ్బైపోతాడు ఆ కామారి. మరి **'మందస్మిత ప్రభాపూర మజ్జత్కామేశ మానసా'** అని ఊరికనే అన్నారా ఆ వసిన్యాది దేవతలు!

నీ నవ్వులో వున్న మధురిమ ముందు ఆ చదువుల తల్లి వీణానాదమే వెలవెల బోయిందటగా. **'నిజసల్లాప మాధుర్య వినిర్భర్సిత కచ్ఛపీ'** అని వాళ్ళూ వీళ్ళూ చెప్పుకుంటుంటే తెలిసింది.

మా ఆది శంకరులు కూడా సౌందర్యలహరిలో 'విపంచ్యా గాయంతీ వివిధమపదానం పశుపతే......' అంటూ మొదలయ్యే శ్లోకంలో ఈ విషయాన్నే చెప్పారు. సరస్వతీదేవి నీ దగ్గర కూర్చుని, మీ ఆయన చేసే లీలలను తన వీణ కచ్ఛపిపై గానం చేస్తోందట. నువ్వేమో పొంగిపోయి 'భలే పాడుతున్నావ్' అన్నావట. అసలు నీ మాటలో వున్న మాధుర్యం ముందు నా వీణానాదం మరీ తీసికట్టుగా వుందనుకుంటూ, ఆవిడ గభాలున ఆ వీణను తీసి మూట కట్టేసిందట.

ఇక్కడ ఇంకొక విషయం.... నీకు మీ ఆయనన్నా, మీ ఆయనను కీర్తించేవారన్నా ఎంతిష్టమో కదా! **'మహాకామేశ మహిషీ'** అని పిలిస్తే చాలు ఎంత పొంగిపోతావో. అవున్లే! అసలు వున్నదంటూ మీరిద్దరే కదా. ఈ సృష్టి మొత్తం లయం చేసేసి, నీ మగడు ఆనంద తాండవం చేస్తుంటే...... అసలు పోలికే లేని అందమైన చుబుకం గల **'అనాకలిత సాదృశ్య చుబక శ్రీ విరాజిత'**వైన నువ్వు, నీ పల్లవములవంటి అందమైన చేతులను అలా ఆ చుబుకం క్రింద పెట్టుకుని, ఆ తాండవాన్ని చూసి పరవశించిపోతూ.... **'మహేశ్వర మహాకల్ప మహాతాండవ సాక్షి'**విగా వున్నావు. నువ్వసలే **'లాస్యప్రియ'**వు కూడానాయే. ఎంతటి **'మహాలావణ్య శేవధి'**వి, **'ఆబ్రహ్మకీట జనని'**వీ అయినా కూడా, నీకు మీ ఆయన తొడమీద కూర్చుని, **'శివకామేశ్వరాంకస్థా'** అని అనిపించుకోవడమే ఇష్టం.

అందుకే మా కాళిదాసు **'వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే। జగతః పితరౌ వందే పార్వతీ పరమేశ్వరౌ'** అంటూ మీ ఇద్దరి అభేదాన్ని చూపిస్తూ నమస్కరించాడు. అసలు మా కాళిదాసు వ్రాసిన 'దేవీ అశ్వధాటి' స్తోత్రం చదివితే తెలుస్తుందమ్మా! మా కవుల కవిత్వంలోని సొగసు. సంగీతం ఏ మాత్రం రానివాడికి కూడా తనకు సంగీతం వచ్చునేమో అనే భ్రమ కలిగించేటంత అందంగా ఉంటుందా శ్లోకాల నడక.

- సశేషం

# మదాలస

- రావి శోభ

మదాలస ఒక గంధర్వ కాంత. ఋతుధ్వజుడు అనే మహారాజును వివాహం చేసుకుంది. మోక్షసాధనమే మానవుని జీవితానికి పరమార్థమని జోలపాట రూపంలో పాడి తన పిల్లలను చిన్నతనంలోనే పరమాత్మ చింతన అనే తపస్సు ద్వారా పునీతులను చేసిన గొప్ప యోగీశ్వరి మదాలస. పుట్టిన పిల్లలకు ఊయలలో వుండగానే వేదాంతమంతా జోలపాట రూపంలో పాడి వినిపించేది.

ఈ పద్ధతి మహారాజు ఋతుధ్వజునికి ఇష్టం లేదు. అప్పటికే ముగ్గురు పిల్లలు రాజ్యం వదలి తపస్సుకై వెళ్ళిపోయారు. మరొక బిడ్డను ప్రసవించిన మదాలసతో మహారాజు 'దేవీ! ఈ పిల్లవాడైనా మహారాజై రాజ్యం ఏలుకోనిద్దాం!........' అంటున్న మహారాజుతో మదాలస వెంటనే 'అలాగే! ఈ బాలుడు మీరు కోరుకున్నట్లే రాజ్యభారం వహించి రాజ్యాభిషిక్తుడు అవుతాడు' అన్నది. ఆ మాట విన్న ఋతుధ్వజుడు ఆనందంతో 'దేవీ! ఈసారి ఈ బిడ్డకు నీవే పేరు పెట్టు' అని అడిగాడు. అది విని ఒక్క క్షణం ఆలోచించి మదాలస ఆ పిల్లవాడికి 'అలర్కుడు' అని పేరు పెట్టింది. ఆ పేరు విన్న మహారాజు ఒక్క క్షణం నివ్వెరపోయి తిరిగి తేరుకుంటూ 'అదేం పేరు? అలా పెట్టావు?' అని అడిగాడు.

దానికి చిరునవ్వుతో మదాలస "మహారాజా! మీరు పెద్ద కుమారుడికి 'విక్రాంతుడు' అని కదా పేరు పెట్టారు. దాని అర్థం క్రాంతి అంటే గమనం అని. మరి విక్రాంతుడు అంటే విశేషగమనం కలవాడని అర్థం కదా. మహారాజా! అసలు ఆత్మకు గమనం ఎక్కడిది? అలాగే మీరు రెండో పిల్లవాడికి 'సుబాహువు' అని కదా పేరు పెట్టారు. అంటే మంచి బాహువులు కలవాడని అర్థం. కానీ ఆత్మకు కాళ్ళు, చేతులు లాంటివి వుండవు కదా! ఇక మూడో పిల్లవాడికి 'శత్రు మర్ధనుడు' అని పెట్టారు. ఆత్మకి శత్రువులు ఎవరు? శరీరమా? లేక అవయవాలా?

మహారాజా! అందుకే ఏ పేరు అయితే ఏమిలే అని నా నాల్గవ కుమారుడికి 'అలర్కుడు' అని పేరు పెట్టాను. అలర్కుడు అంటే తెల్లజిల్లేడు పూలలాగా ప్రకాశించేవాడు అని అర్థం. మీరు కోరినట్లే ఈ పిల్లవాడు రాజ్యాభిషిక్తుడు అవుతాడు" అని చెప్పింది మదాలస.

ఆమె మాటలు శ్రద్ధగా విన్న ఋతుధ్వజుడు ఆనందపడ్డాడు. అలా కొంతకాలం గడిచాక, యుక్తవయస్సు వచ్చిన అలర్కుడికి రాజ్యాభిషేకం చేసి, ఋతుధ్వజుడు, మదాలస వానప్రస్థాశ్రమం స్వీకరిస్తారు. ఆ సమయంలో మదాలస అలర్కుడి చేతికి ఒక ఉంగరం ఇచ్చి, 'నాయనా! పుత్రా! భవిష్యత్తులో నీకు భరించలేని బాధ ఒకటి వస్తుంది. అప్పుడు ఈ ఉంగరాన్ని తెరచి చూడు. నీకు సమాధానం దొరుకుతుంది' అని చెప్పి, మదాలస తన భర్తను తీసుకుని వానప్రస్థానికి వెళ్ళిపోతుంది.

అలర్కుడు రాజ్య పాలన చేస్తూ చాలా సంవత్సరాలు గడిచిపోయాయి. ప్రజలందరూ కూడా ఆయన పాలనలో సుఖసంతోషాలతో కాలం గడుపుతూ వుండగా, హఠాత్తుగా కాశీరాజు దురాక్రమణ చేస్తాడు. అలర్కుడికి రాజ్యం పోయి ఏకాకిగా మిగులుతాడు. అప్పుడు తన తల్లి చెప్పిన మాటలు గుర్తుకు వచ్చి, ఆ ఉంగరాన్ని తెరచి చూస్తాడు. రాతితో పొదగబడిన ఆ ఉంగరంలో ఒక లేఖ రాసి వుండటం గమనించి, ఆ లేఖ తీసి ఆతృతగా చదివాడు. అందులో ఇలా వున్నది..............

1. మానవుడు ఒదలుకోవడానికి ప్రయత్నం చేయవలసినదేది? దేని సహాయం లేకుండా ఏర్పడేది ఏది?

జవాబు - సంగమే. ఆ సంగాన్ని కూడా సజ్జన సాంగత్యం ద్వారా ఆధ్యాత్మికతను పెంచుకోవచ్చు.

2. కామాన్ని ఏ విధంగా దాటాలి?

జవాబు - ముక్తి ద్వారా. ముక్తిపై కామాన్ని పెంచుకోవాలి. భగవంతునిపై వున్న భక్తి శ్రద్ధల ద్వారా కామం నశించి, ముక్తి దొరుకుతుంది.

ఈ విధమైన ప్రశ్నలు, జవాబులు ఆ లేఖలో చదివిన అలర్కుడికి గురుదేవుని విశిష్ఠత తెలిసి, శ్రీ దత్తాత్రేయుల వారిని ఆశ్రయించి, వారి ద్వారా తన జన్మను సార్థకం చేసుకుంటాడు.

# రామాయణంలో స్త్రీ పాత్రలు

-సుషమ్మా ప్రసాద

## సీత

ఆమె సఖులందరూ ఆమెను కాంతిరేఖలతో కలసిపోయావని కొనియాడేవారు. ఆమె సఖులతో ఆటపాటలలో పాల్గొంటూ శివధనస్సును అవలీలగా ఎత్తగలిగింది. అది చూసి అందరూ నివ్వెరపోయారు. ఆ సంఘటనతో జనక మహారాజు ఉప్పొంగిపోయాడు. తన కుమార్తెను పొందాలనుకునే వరుడు శివ ధనస్సును ఎక్కు పెట్టాలనే ధృడ సంకల్పం కలిగింది. వీరత్వమే తన పుత్రికకు శుల్కమని భావించాడు జనక మహారాజు.

అతిలోక సుందరి, అనుపమ సుగుణరాశియైన సీతామహాలక్ష్మిని వివాహమాడాలని భారతావనిలోని రాకుమారులు అందరూ ఉర్రూతలూగినా, శివ ధనస్సును ఎక్కుపెట్టడం అసాధ్యమని వెనుకంజ వేశారు.

సీతమ్మకు తగిన వరుడు శ్రీరామచంద్రుడు తప్ప వేరొకరు లేరు. విశ్వామిత్ర మహర్షి , రామలక్ష్మణులు మిథిలానగరానికి రామచంద్రుని కళ్యాణరామునిగా చూడాలని తోడ్కొని వచ్చేశారు. శ్రీరాముడు చేసిన శివధనుర్భంగముతో జనకమహారాజు మహదాశయము నెరవేరి, సీతారాముల కళ్యాణము భూలోకంలో న భూతో, న భవిష్యతి అన్నట్లుగా అత్యంత వైభవంగా జరిగింది.

జనక మహారాజు తన ముద్దుల పుత్రిక సీతమ్మ పాణిని శ్రీరామచంద్రుని పాణిగ్రహణ సమయంలో ఇలా చెప్పాడు 'ఇయం సీతా, మమ సుతా సహధర్మచారిణీ తవ ప్రతీచ్ఛ చైనాం భద్రం తేపాణిం గృహ్ణీష్వ పాణినా పతివ్రతా మహాభాగాయేవామగతా సదా ।

ఇదిగో నా పుత్రికైన సీత యికపై నీ సహధర్మచారిణి. ఈమెను స్వీకరించు. నీ చేతితో ఈమె చేతిని పట్టుకో. మహా భాగ్యవంతురాలైన నా పుత్రిక సీత పతివ్రతయై, నిన్ను సదా నీడలాగా అనుసరిస్తుంది' అని చెప్పి మంత్రపూరితమైన జలాన్ని రాముని చేతిలో విడిచాడు జనకుడు. పాణిగ్రహణ సమయంలో జనకుడు చెప్పిన ఈ శ్లోకం చాలా భావగర్భితమైనది. వివాహ సమయంలో కన్యాదానం చేసేటప్పుడు కన్యాదాత ఈ శ్లోకాన్ని చెబుతాడు.

జనకుడు ఇయం - ఇదిగో! అంటూ సీతను రామునకు పరిచయం చేసే దానిలో నిగూఢమైన భావన వున్నది. జనకుడు శ్రీరామచంద్రుడు సీతవైపు కాకుండా వేరొకవైపుకు చూస్తూ వుండటం గమనించాడు. ఎందుకంటే దివ్యకాంతితో విరాజిల్లుతున్న జానకి ముఖకమలం చూడగానే రాముడొక క్షణం దిగ్భ్రాంతి చెంది , వేరొకవైపు చూస్తున్నాడు. ఇది కనిపెట్టిన జనకుడు సీతను చూపిస్తూ (ఇయం) ఇదిగో రామా! నీవే గొప్ప సౌందర్యమూర్తివి అనుకోకు. మా సీత నీకు దీటైన సౌందర్య మూర్తి. మా సీతమ్మ చెంతన వుంటేనే నీ సౌందర్యము ద్విగుణీకృతమై శోభిల్లుతుంది. ఈమె అయోనిజ, భూజాత, భూమాత వంటి సహనంతో జీవితంలోని ఒడిదుడుకులను నిన్ను ఆశ్చర్యపరచేటట్లు అధిగమించగలదు.

మమ సుతా - అనడంలో ఈమె నా వంశ గౌరవమును నిలబెట్టగలదు. ఇంకా ఈమె నా కుమార్తె. నాలాగే విరాగిని కనుక నీవే సర్వమై ఆమెను రక్షించాలి అనే భావన కూడా ఇమిడి వున్నది. సీతామహాలక్ష్మి జననీ జనకులను వదలి అయోధ్యకు వెళ్ళేటప్పుడు ఆమె చెలులు, పెంపుడు పక్షులు, జంతువులు, సన్నిహితులు, వేయేల మిథిలా నగరమంతా కన్నీరు మున్నీరుగా విలపించింది. జానకి మిథిలను విడచి వెళ్ళేటప్పుడు ఆ భూమిపై మంగళాక్షతలు చల్లింది. అందుకే ఈనాటికీ ఆ ప్రాంతంలో సశ్యశ్యామలమై చక్కని పంటలు పండుతాయంటారు.

సీతారాములు అపూర్వజంటగా అయోధ్యలో 12సంవత్సరాలు ఆనందంగా గడిపారు. ఇంతలో శ్రీరాముని తండ్రి వృద్ధుడైన దశరథ మహారాజుకు శ్రీరామునకు పట్టాభిషేకం చేసి, మహారాజుగా చూసుకోవాలనే సంకల్పం కలిగింది. మందర వశీకృతురాలైన కైకమ్మ కోరిన వరాలతో అంతా ఛిన్నాభిన్నమై, ఆనందమంతా ఆవిరైపోయింది. శ్రీరామచంద్రునికి 14సంవత్సరాలు వనవాసం, భరతునికి పట్టాభిషేకం అనే రెండు వరాలు కోరుకున్నది. దశరథుడు ఆ కోరికలకు హతాసుడై, నిర్విణ్ణుడైనాడు. అంతా తారుమారై రామచంద్రుడు వనవాసానికి సన్నద్ధుడయ్యాడు.

- సశేషం

# శ్రీశ్రీశ్రీ బాబూజీ మహరాజ్‌వారితో అనుభవాలు

(గత సంచిక తరువాయి) -వి. లక్ష్మీ నరసమాంబ

**ఇలాంటిదే మరొక సంఘటన ....................**

ఇది జరిగిన కొంతకాలం తరువాత సికింద్రాబాద్‌లోని ఒక కాలేజీలో సత్సంగ సమావేశాలు జరిగాయి. అప్పటికి రెండు రోజులుగా నేను ప్రతి సాయంకాలం సమావేశాలకు హాజరవుతున్నాను. అప్పుడు నాకు ఒక ఆలోచన వచ్చింది. నా దగ్గర బీరువాలో ఆకుపచ్చ అంచుగల ఆఫ్‌వైట్ పట్టుచీర వుంది. దానిని అమ్మకు ఇవ్వాలనిపించింది. కానీ, వారెప్పుడూ కుంకుమ రంగు, కాషాయం, పసుపు, ఆకుపచ్చ వంటి నిండు రంగుల చీరలు కట్టుకోవడమే చూశాను. మా పిన్ని కూడా అదే చెప్పింది. మరి ఈ తెలుపు రంగు పట్టుచీర కడతారా? లేక వేరుగా భావిస్తారా? అని సందేహిస్తూ ఆ చీరను అలానే వుంచాను. ఆ చీర ఇవ్వడానికి తీసుకురాలేదు.

ఆ రోజు సమావేశాలకు ఆఖరిరోజు. హాలులో నేను వెనుక భాగాన కుర్చీలు వున్న చోట కూర్చున్నాను. మాతాజీగారు స్టేజ్ మీదకు వచ్చారు. ఆశ్చర్యం! ఆమె సన్నని ఆకుపచ్చ అంచుగల తెల్లపట్టుచీరలో వున్నారు. ఆ అనుభవాన్ని ఏమనాలి? ఆమె యాధృచ్ఛికంగా ఆ చీర ఎలా కట్టుకున్నారు? ఎవరైనా నా ఆలోచన తెలుసుకుని, అమ్మగారితో ఆ తెల్లచీర కట్టించి నా సందేహానికి సమాధానవం చెప్పించారా? పోనీ, అది నా భ్రమ అనుకుందామంటే ఆ తెల్ల చీరలో కూర్చుని వున్న అమ్మ ఫొటో సమర్థ సద్గురు మాసపత్రిక పైన కూడా వున్నది. ఇలా చేయగలిగిన వారెవరు? ఇంకెవరు? బాబుగారే!

**మరొకసారి ..............................**

హిమాయత్‌నగర్ తిరుపతి దేవస్థానంలో సత్సంగ సమావేశాలు జరుగుతున్నాయి. మొదటిరోజు ఉదయం నేను బాలాజీ భవన్‌కు చేరుకునేసరికి, ప్రాతఃకాల ప్రార్థనలు పూర్తయి, మాతాజీ అందరికీ తీర్థం ఇస్తున్నారు. నేను వారికి నమస్కారం చేసుకుని, తీర్థం కోసం చేయి ముందుకు చాచాను. వారు నా ముఖం వంక చూస్తూ 'బాగున్నారా? బాబుగారు మనకు ఎప్పుడూ తోడుగా వుంటారు అనిపిస్తుంది కదా!'

అన్నారు. నేను ఆశ్చర్యపోయాను. ఎందుకంటే, గత కొద్దికాలంగా నాలో అదే భావన మెదలుతోంది. బాబుగారే తోడుగా వుండి అన్నిపనులూ చేయిస్తున్నట్లుగా వుండేది. మాతాజీగారు నన్ను చూడగానే అదే భావన ప్రకటించేసరికి నా మనసులోని ఆలోచన వారికి తెలిసిందా!' అని ఆశ్చర్యపోయాను.

సత్సంగ సమావేశాలు జరుగుతున్నాయి. ఆఖరిరోజు సాయంకాలం 4గం. నుండి సమావేశం ప్రారంభం అయింది. అమ్మగారి ప్రసంగం జరుగుతోంది. హాలు నిండుగా జనం. నేనూ, మా అక్క వెనుక వరుసలో కుర్చీలలో కూర్చున్నాము. మా ముందు వరుసలో నేలమీద జంపఖానా మీద రమణయ్యగారి భార్య అరుణ కూర్చుని, ఏడాది వయస్సుగల మనుమణ్ణి ఒడిలో కూర్చోబెట్టుకుని ప్రసంగం వింటున్నారు. అటూ ఇటూ ఊగుతూ వెనుక వున్న మమ్మల్ని చూసి నవ్వుతున్నాడు. ఆ పిల్లవాడు అచ్చు రమణయ్యగారి పోలికే! వాడు మారాం చేస్తుంటే ఆమె సముదాయిస్తున్నారు. రమణయ్యగారు దూరంగా నిల్చుని వున్నారు. నేను మాతాజీగారి ఉపన్యాసం వింటూనే, ఆ తాతామనవలను మార్చిమార్చి చూస్తున్నాను. వారిద్దరికీ గల పోలికలకు అబ్బురపడుతూ వుండబట్టలేక, అరణగారి భుజం తట్టి, 'మీ మనువడా?' అన్నాను. 'అవునండీ' అన్నారు ఆమె నవ్వుతూ.

'అచ్చం మీ వారి పోలికలే! కూతురు కొడుకా? కొడుకు కొడుకా?' అన్నాను సంభాషణ పొడిగిస్తూ ... ఈలోగా అమ్మగారు ఇటు చూడలేదు కదా! అని జాగ్రత పడతున్నాను.

దానికి ఆమె 'కొడుకు కొడుకు కాదు' అంటూ మర్యాదగా వెనకకు తిరిగి జవాబు ఇచ్చారు. ఇంతలో రమణయ్యగారు అటురావడం, పిల్లవాడిని ఆయనకు ఇవ్వడం జరిగింది. ఇంతసేపు అమ్మగారు ప్రసంగంలో మరొకవైపు చూస్తున్నారు. ఆ విషయం నేను గమనిస్తూనే వున్నాను. వారు మేము మాట్లాడుకోవడం చూడలేదు కదా అని నేను తృప్తిపడ్డాను.

- సశేషం


నీచం
మధుప
ఈ రోజు మన ఊరంతా తిరిగి నీకు కనపడిన వాటిలో అన్నింటికన్నా నీచమైనది ఏదో అది తీసుకురా.
1
చిత్తం గురుదేవా!
2


ఈ కుక్క నీచమైనదే
కదా! కానీ ఇంతకంటే
నీచమైనది ఏమైనా
దొరుకుతుందేమో
చూద్దాం!
3
ఈ బిచ్చగాని బ్రతుకు
కూడా నీచమైనదే! కానీ
ఇంతకంటే నీచమైనది
ఏమైనా
దొరుకుతుందేమో
చూద్దాం!
4


ఆ! ఈ పెంటకన్నా నీచమైనది ఇంకేమీ ఉండదు. దీనినే గురువుగారి దగ్గరకు తీసుకెళదాం!
5


ఆగు నాయనా! నేనెవరనుకుంటున్నావు? కమ్మగా నెయ్యి జీడిపప్పులు వేసి ఎంతో రుచిగా ఉందని నిన్న నువ్వు తిన్న పవిత్రమైన చక్కెర పొంగలి ప్రసాదాన్ని.
6


నీ కడుపులో పడి ఇవాళ్టికి నాకీ గతి పట్టింది. ఇప్పుడు చెప్పు! నీచమైనది నువ్వా? లేక నేనా?
7
అర్థమైందా నాయనా! ఆ భగవంతుని సృష్టిలో నీచమైనదంటూ ఏదీ లేదు. నీ మనసులోని నీచభావాలను తొలగించుకొని మనస్సు పవిత్రం చేసుకుంటే సృష్టిలోని ప్రతి వస్తువులో పవిత్రమైన భగవత్తత్వమే గోచరిస్తుంది.
8

# కరోనా బోధించిన పాఠం

(గత సంచిక తరువాయి) -పాలూరి కాళీప్రసాద్

కరోనా వచ్చిన క్రొత్తలో దాని గురించి జనాలలో అవగాహన పెంచడానికి, దాని నుండి రక్షణ కొరకు వారు సామాగ్రిని సమకూర్చుకోవడానికి తగిన సమయం పొందడం కొరకు లాక్‌డౌన్ కొంతవరకు ఉపయోగ పడింది. అయితే అది శాశ్వత పరిష్కారం కాదు. మానవుడు సంఘజీవి. సమాజానికి దూరంగా, ఒంటరిగా బ్రతకడం ఎక్కువ కాలం సాధ్యం కాదు. అందుకే ఒక అవగాహన, సాధన సామాగ్రి ఏర్పడిన తరువాత ఇప్పుడు ఆ లాక్‌డౌన్ ఎత్తివేసి, ఎవరి జాగ్రత్తలు వారు పాటిస్తూ సాధారణ జీవనం గడపమంటున్నారు.

శ్రీకాళీ వనాశ్రమం ఏర్పడిన క్రొత్తలో ఇలాగే ఇంచుమించు లాక్‌డౌన్ పరిస్థితే వుండేది. ఒకసారి ఆశ్రమంలో స్థిర నివాసం ఏర్పరచుకున్న తరువాత ఎవరు ఏ పని మీద బయటకు వెళ్ళాలన్నా శ్రీ గురుదేవుల అనుమతి తీసుకోవడం తప్పనిసరి. తీరా వారి వద్దకు వెళితే, 'ఇప్పుడు నువ్వు వెళ్ళడం అవసరమా? నువ్వు వెళ్ళకపోతే అక్కడ పనులు ఆగిపోతాయా? నువ్వు వెళ్ళి నీ బిడ్డలను, బంధువులను ఆపదల నుండి, రోగాల నుండి రక్షించగలవా? అదే నువ్వు ఇక్కడే వుండి చక్కగా సాధన చేసుకుంటుంటే, వారి రక్షణ భారం భగవంతుడు చక్కగా వహిస్తాడు' అంటూ శ్రీ గురుబోధ వారిలో సరియైన విచారణను మేల్కొల్పేది. అలా కొంతకాలం ఆశ్రమవాసులందరికీ శిక్షణ ఇచ్చిన తరువాత ఇక నిర్ణయాన్ని వారివారి విచక్షణకే వదిలివేశారు. వరిపంట కోసిన తరువాత ఆ ధాన్యాన్ని రైతు తూర్పారబడతాడు. అందులో గట్టి గింజలు రైతు పాదాల దగ్గరే పడి వుంటాయి. తాలు గింజలు గాలికి కొట్టుకుపోతాయి. అలాగే సాధనలో గట్టిగింజలైనవారు ఎన్ని అవాంతరాలు, ఆకర్షణలు వచ్చినా లొంగక ఆశ్రమాన్నే ఆశ్రయించుకుని గురుపాద సన్నిధిలో తమ జన్మలను చరితార్థం చేసుకున్నారు.

కరోనా ఇతరుల నుండి మనకు అంటుకోకుండా చూసుకోవడం ఎంత ముఖ్యమో, మన నుండి ఇతరులకు వ్యాపించకుండా చూసుకోవడమూ అంతే ముఖ్యం. రోగనిరోధక శక్తి ఎక్కువగా

వున్నవారిలో ఈ వైరస్ వచ్చినా అది వారిపై ఎటువంటి ప్రభావమూ చూపదు. కానీ, అది వారి నుండి ఇతరులకు వ్యాపించే అవకాశాలు తప్పకుండా వుంటాయి. ఇది వారికి తెలియకుండానే జరుగుతుంది. అలాగే ఆధ్యాత్మిక శక్తి ఎక్కువగా వున్నవారిపై ప్రాపంచిక విషయాదులు ఎక్కువ ప్రభావం చూపకపోవచ్చు.కానీ, వారు కూడా తాము మాట్లాడే ప్రతి మాటనూ ఎప్పటికప్పుడు గమనించుకుంటూ, అవి ఇతరులపై దుష్ప్రభావం చూపకుండా జాగ్రత్తపడాలి. ఉదాహరణకు మార్కెట్‌లో క్రొత్త ఫోన్ వచ్చిందనే విషయం మీరు విని దానిని చాలా తేలికగా తీసుకుని వుండవచ్చు. కానీ, అదే వార్తను మీరు నలుగురితో పంచుకున్నప్పుడు, అందులో ఒకరికి ఆ వార్త ఆ ఫోన్‌ను పొందాలనే తీవ్రమైన వాంఛను కలిగించవచ్చు. అందుకే మనం మాట్లాడే ప్రతిమాట ఎంతవరకు అవసరమో, అది అవతలివారికి ఎంతవరకు ఉపయోగ పడుతుందో గమనించుకుంటూ వుండాలి. రోగం వచ్చినా, రాకున్నా ప్రతివారూ మాస్కులు ధరించాలనే నియమంతో కరోనా మనకు బోధించే పాఠం ఇదే!

## భక్తులకు విన్నపము

శ్రీగురుదేవుల అనుగ్రహం వలన భక్తులు పొందిన అనుభవాలను గ్రంథస్థం చేసే ఉద్దేశ్యంతో తమ తమ అనుభవాలను వ్రాసి పంపమని విజ్ఞాపన చేసియున్నాము.

శ్రీగురుదేవుల స్వస్వరూప లయం తరువాత, శ్రీగురుమాత ద్వారా మనకు అనేకవిధాల రక్షణ జరుగుతోంది. అనేక లీలలను వారు చూపిస్తున్నారు. అనేక దివ్యానుభవాలు భక్తులకు కలుగుతున్నాయి.

భక్తులు పొందిన అట్టిఅనుభవాలను భక్తులందరూ పంచుకొనే సంకల్పంతో తలపెట్టిన "శ్రీసద్గురునాధుని దివ్య చరిత్ర - 3" గ్రంథం పేరు మార్చి **"శ్రీ గురు కృప"** అని పేరు నిర్ణయించటం జరిగింది.

అందరూ ఈ మార్పును గమనించి తమ తమ అనుభవాలను సమగ్రంగా వ్రాసి సత్వరంగా పంపమని ప్రార్థిస్తున్నాము.

# మధురం మధురం మధురం

- విజయ రాఘవీయం

(గత సంచిక తరువాయి)

దశరథ మహారాజు శ్రీరాముడితో తన పట్టాభిషేకం గురించి సభ ఆమోదాన్ని, నిర్ణయాన్ని తెలిపి మరుసటి రోజు ఉదయమే మహూర్తం సిద్ధంగా వుండమన్నాడు. దానిని శ్రీరాముడు ప్రశాంతంగా స్వీకరించి, తన ఆమోదాన్ని తెలిపి సభ నుండి నిష్క్రమించాడు. ఆ సమయంలో రాముని ముఖారవిందంలో ఎటువంటి భావోద్వేగాలు లేక నిర్మలంగా ప్రశాంతంగా వుంది. అంటే తనకే రాజ్యం వస్తుంది కదా అని అతి ఆనందాన్ని ప్రదర్శించలేదు. అంత భావోద్వేగాలను అదుపులో వుంచుకోవడం ఒక్క శ్రీరామునికే చెల్లు. అది ఆయన స్థితప్రజ్ఞత్వానికి గురుతు.

అదే విధంగా మరుసటి రోజు ఉదయం కైకమ్మ గృహంలో ఆమె కోరిన రెండు వరాలలో ఒకటి శ్రీరాముడు పద్నాలగు సంవత్సరాలు అరణ్యవాసం, రెండవది భరతుని పట్టాభిషేకం. సత్యబద్ధుడైన దశరథ మహారాజు సమ్మతించి అదే సుమంతునితో శ్రీరాముని పిలిపించాడు. శ్రీరాముని చూసి కైకమ్మ తన వరాల సంగతి, మహారాజు సత్యనిష్ఠ గురించి తెలిపి రాముని అడవులకు పోవలసినదిగా ఆజ్ఞాపించింది. అంతకుముందు శ్రీరాముడు ఎటువంటి ప్రశాంత వదనంతో వున్నాడో, ఇప్పుడు కూడా అదే ప్రశాంత వదనంతో ఆ ఆజ్ఞను స్వీకరించాడు. అంటే, సంతోష వార్త విన్నప్పుడు పొంగిపోయి, కష్టమైన వార్త విన్నప్పుడు కృంగిపోయి ఎప్పటికప్పుడు ముఖంలో రంగులు మారిపోయే తత్త్వం కాదు శ్రీరామ చంద్రునిది. శీతోష్ణ సుఖదుఃఖాలను సమంగా స్వీకరించే తత్త్వం ఆయనది. అందుకే ఆయన ద్వంద్వాతీతుడని స్తుతింపబడ్డాడు.

జనకుని కొలువులో సీత స్వయంవర సందర్భంలో రాజకుమారులందరూ శివధనస్సును ఎక్కుపెట్టలేక విఫలురైనప్పుడు శ్రీరాముడు విశ్వామిత్రుని ఆజ్ఞననుసరించి, శివధనస్సును ఎక్కుపెట్టడం, అది ఫెళ ఫెళమని విరిగిపోవడం జరిగినప్పుడు, జనకమహారాజు మహదానందంతో సీతను తెచ్చి, రాముని మెడలో వరమాల వేయించి, ఆమె చేతిని రామునిచేతిలో వుంచబోతాడు. అంటే సీతను రాముని

భార్యగా స్వీకరించమని కోరడమన్నమాట. కానీ, రాముడు తన చేతిని వెంటనే వెనక్కి తీసుకుంటాడు. జనకునితో శ్రీరాముడు 'మహారాజా! నేనూ, మా తమ్ముడు లక్ష్మణుడూ మా గురువుగారైన విశ్వామిత్రులవారితో కలసి, ఇక్కడ స్వయంవరం చూద్దామని వచ్చాము. రాజ కుమారులందరూ విఫలురవుతుంటే, నిరుత్సాహపడుతున్న మిమ్మల్ని చూసి, మా గురువుగారు రామా! దాని సంగతేమిటో చూడు! అంటే, దీని దగ్గరకు వచ్చి చేతిలోకి తీసుకున్నాను. అది విరిగిపోయింది. అంతేకానీ, మీ అమ్మాయిని వివాహం చేసుకోవాలని కాదు. నేను వివాహం చేసుకోవాలంటే, ఆ వధువు గుణగణాలు వంశ మర్యాదలు మా ఇక్ష్వాకు వంశానికి తగినదా కాదా అని చూసి నిర్ణయించవలసినది మా నాన్నగారైన దశరథ మహారాజుగారు' అన్నాడు.

- సశేషం

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

**జనవరి 2021**

8 శుక్ర - శ్రీ గురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

13 బుధ - భోగి - శ్రీసద్గురుపాదపూజ రాత్రి 7గం.లకు శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట.

14 గురు - సంక్రాంతి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

28 గురు - పుష్య పూర్ణిమ - శ్రీ సద్గురు పాదపూజ, భక్త సమారాధన.

**ఫిబ్రవరి 2021**

6 శని - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

23 మంగళ - భీష్మ ఏకాదశి - శ్రీసద్గురుదేవుల మూర్తి ప్రతిష్ఠా వార్షికోత్సవం . శ్రీసద్గురు పాదపూజ.

27 శని - మాఘపూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ

(గత సంచిక తరువాయి) 

# శ్రీకృష్ణ జన్మాష్టమి

-సుషుమ్నా ప్రసాద

శ్రీకృష్ణ జన్మాష్టమి మానవాళికి అంతా మధురిమను ప్రసాదించిన మహిమాన్వితమైన పర్వదినము. చెరసాలలో ప్రభవించి, గోకులానికి తరలివచ్చి, గోపాలకులను, గోపికలను మరిపించి, మురిపించి, ఆనంద డోలికలలో ఓలలాడించాడు. సంసారమనే చెరసాల సంకెళ్ళ నుండి విముక్తిని ప్రసాదించాడు. అష్టమినాడు అవతరించడంలో ఎంతో అద్భుతమైన తత్త్వము నిండి నిబిడీకృతమై వున్నది. దేవకీదేవికి అష్టమ గర్భాన అష్టమ సంతానంగా పుత్రుడు ఆవిర్భవించాడు. దేవకీవసుదేవుల అష్టమ సంతానం కంసుని అష్టకష్టాలకు లోను చేసింది. మానసికంగా అష్టావక్రుని చేసింది. భగవద్భక్తులకు అష్టకష్టములు తొలగించి, అష్టైశ్వర్యములను ప్రసాదించింది. అష్టమి అనే పదానికి ఎంతో ప్రత్యేకత, విశిష్టత వున్నాయి. కృష్ణపరమాత్మ తాను అవతరించడానికి శ్రావణమాసంలోని కృష్ణపక్షములోని అష్టమి నాడే సానుకూల సాఫల్యములను ప్రసాదించేదిగా నిర్ణయించుకున్నాడు. కృష్ణపక్షం 15 రోజులలో మధ్యలో వస్తుంది అష్టమి. మధ్యలో వుండటంతో సర్వులను ఆకర్షిస్తుంది. శ్రావణ బహుళాష్టమి తాను అవతరించవలసిన రోజుగా శ్రీకృష్ణ పరమాత్మ నిర్ణయించుకున్నాడు.

ఆకాశము మేఘావృతమై వుండగా, నీలమేఘశ్యాముడైన కృష్ణ భగవానుడు దేవకీదేవి నోముల పంటగా, తపఃఫలంగా తమస్సును పారద్రోలుతూ సర్వమానవాళినీ తరింపజేయటానికై ముగ్ధమోహనుడైన మురళీకృష్ణుడిగా ప్రభవించాడు. అణిమాదిసిద్ధులను అష్ట సిద్ధులుగా పేర్కొంటాము. యోగ సిద్ధులలో అష్టమస్థితి సమాధిస్థితి. అంటే యోగస్థితిలో పతాక స్థితి. అష్టలక్ష్మీ సమేతుడైన కృష్ణపరమాత్మ అష్టసతులను స్వీకరించాడు. అష్టప్రకృతులు శ్రీకృష్ణుని ఆధీనంలో వుంటాయి. వసువులు కూడా ఎనిమిదిమంది. అందులో అష్టవసువైన గాంగేయుడు భీష్మాచార్యులు కృష్ణభగవానుని అత్యంత ప్రియభక్తుడు. యుద్ధభూమిలో, అంపశయ్య మీద వున్న భీష్మపితామహుని చేత యుధిష్టిరుని నిమిత్తంగా విష్ణు సహస్ర నామ స్తోత్రం భక్తకోటికి బహుమానంగా ఇప్పించాడు.

-సశేషం

# శ్రీబాబు దివ్యవాణి

(గత సంచిక తరువాయి)　　　　　　　　　　　　　　　　- డా॥ రాఘవేంద్ర. పరుచూరి

జితేంద్రియుడు ఒక్కసారి 'రాం' అంటే రోమాలన్నీ 'రాం' అనేవి. 33కోట్ల నామం జరిగేది. ఆయన హృదయం రామ నామంతో నిండిపోయేది. జనరేటర్ స్పీడ్‌గా తిరిగితేనే కరెంట్ వుత్పన్నమవుతుంది. ఆ కరెంట్‌తో లైట్లు వెలుగుతాయి, ఫ్యాన్‌లు తిరుగుతాయి, సమస్త పనులు జరుగుతాయి, జ్యోతి ప్రకాశిస్తుంది. అలాగే జితేంద్రియుడు కాలాన్ని మరచి రామనామం చేశాడు. జనరేటర్ లాగా రామనామం పెరిగింది. తన లోపలే మానసికంగా మనోలయం అయిపోయింది - కరెంట్ స్పీడ్‌గా వుత్పన్నమయింది - పూర్తిగా జ్యోతి స్వరూపుడు అయిపోయాడు. తదాకారాన్ని పొందాడు. తారక బ్రహ్మానికి తనకు ఎట్టి భేదము లేదు కనుకనే యుద్ధంలో రాముడు బాణం వేస్తే రామునికే తగిలింది. 'నీ నామం ఎంత మహత్తరమైనదో ఆ తేజస్సు అందరికీ తెలుసులే. ఆ శక్తి నాలో నిండి వున్నది' అన్నాడు జితేంద్రియుడు. నా రామబాణానికి శాంతినిచ్చేది నా రామనామమే అన్నాడు. అంత ఆరూఢమైన భక్తి మారుతిది. రామనామ రసమే బాబు ఆశ్రమం - బాబు విజ్ఞాన మందిరం. మనమంతా ఆ దేవుని బిడ్డలం అనే ఏకత్వ దృష్టితో మనముండాలి.

తిరగలిలో పడిన బియ్యపు గింజ పిండి అయినట్లు, మానవుడు ఆకాశం భూమి మధ్యలో విషయాదుల యందుపడి నలిగిపోతున్నాడు. కానీ, గురుజు అనే గురుపాదుకలను ఆశ్రయిస్తే, ఈ విషయాదులు మిమ్మల్నేమీ చేయలేవు.

ప్రతివాడూ నేను ఎవరు? అనే ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలి. ఈ శరీరం నీవా? ఈ కనిపించేది ఏది నీవు కాదు? వీటన్నిటినీ ప్రకాశింపజేసేదే నీవు అని తెలుసుకోగలిగితే చాలు. నీవు మానవుడవా? నానత్వం నశించిన మాధవుడివా? నీవు మానవుడవు కాదు, మాధవుడవే అని తెలుసుకోవాలి. అప్పుడు దుఃఖ రహితుడవై శాంతిని పొందుతావు.

మనం ఎంతో పుణ్యం చేసుకున్నప్పటికీ, పరమాత్ముని సాన్నిధ్యంలోనే వున్నప్పటికీ, పుణ్యం వున్నంతసేపే వుంటారు. అది అవ్వగానే

ఒక్క నిమిషం కూడా వుండ నివ్వరు. అది స్వచ్ఛమైన శాసనం.

మరలా జన్మలేనటువంటి శాశ్వతమైన ఆనందం కావాలంటే ముందు మనలో వున్న దుర్గుణములన్నిటినీ శుభ్రంగా తీసివేయాలి. హృదయాన్ని శుభ్రపరచుకోవాలి. మామూలు ఈగ మలిన పదార్థాల మీద వ్రాలి, మరల మంచి పదార్థాల మీద వ్రాలి వాటిని కూడా పాడుచేస్తుంది. మరి తేనటీగ పుష్పాల మీదనే వ్రాలి, తేనెను ఆర్జించి మనకందరికీ కూడా అందిస్తుంది. రెండూ ఈగలే. కాని స్వభావాలు వేరువేరుగా వున్నాయి చూశారా?

గురుదేవుడు శిష్యుని అవస్థలు చూసి భవబంధరహితమొనర్చి కామాది గుణముల నుండి దూరంచేసి, శాశ్వతానందాన్ని, శాంతిని ప్రసాదించాలని దయతలచి చేరదీస్తారు. సత్యగురువు శిష్యుని యందు చూపిన పరమ వాత్సల్యతను గురించి చెప్పారు శ్రీబాబు. 'ఓం నమో నారాయణాయ' అనే అష్టాక్షరీ మహామంత్రం చెప్పి, అందరితో 'శ్రీరామ జయరామ జయజయ రామ' అనే నామాన్ని పాడించారు. రాధాకృష్ణ యుగళ నామం పాడారు. 'రసతి భజతి సోమ్యతో భవతి' - అన్న దానికి అర్థం చెబుతూ - అలా ఆనందంలో వుండిపోయారు శ్రీబాబు! ఈ స్థితి వ్రాయ నలవికానిది!

***అతి వేగంగా తిరిగే బొంగరం నిశ్చలంగా వున్నట్లు చూపులకు కనిపిస్తుంది. కన్ను దాని వేగాన్ని అందుకో లేకపోవడమే ఇందుకు కారణం. అట్లే జ్ఞాని నిశ్చలుడుగా కనిపించినా ఆ నిశ్చలత్వం మాటున తీవ్రమైన కర్మణ్యత్వం వున్నది. సామాన్యజనులు అది జడత్వమని పొరపాటుపడతారు.***

***-శ్రీ కాళీప్రసాదబాబు***

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

ఈ ఉపాధి దానిలో వున్న ఇంద్రియ మనో బుద్ధులు వుంటేనే అనుభూతిని పొందగలుగుతున్నాము. మహాత్ముల సన్నిధిలో వుంటే వారి చర్యల ద్వారా అనుభూతి ఎలా వుంటుందో వివరిస్తూ శ్రీమాతాజీ ......

'శివానందలహరి శ్రీగురుదేవుల సన్నిధిలో నేర్చుకున్నాము. పోటీలకు కూడా వెళ్ళాము. కానీ పోటీలకు వెళ్ళకముందే గురుదేవుల వద్ద చదివితే వారు ఆనందించి ప్రసాదాలు ఫలాలు ఇచ్చారు. బహుమానాలు కూడా ఇచ్చారు. ఇప్పటికి కూడా వాటిని చూస్తే ఒకప్పుడు గురుదేవులు ఇలా ఇచ్చారు కదా అని ఒక దివ్య అనుభూతి కలుగుతూవుంటుంది' అన్నారు.

ఉపాధి లేకపోతే అనుభూతి ఎక్కడిది? జీవించి వుండగానే ఆ కైవల్యం యొక్క అనుభూతిని పొందాలి . ఈ జన్మ వచ్చినందుకు మానవుడు తన వాస్తవమేదో తాను తెలుసుకోకపోతే సృష్టిలో ఎన్ని వున్నా వ్యర్థమే. పుట్టడం పెరగడం, చచ్చిపోవడం ప్రపంచంలో సృష్టిలో పశు పక్ష్యాదులకు కూడా ఇవన్నీ వున్నాయి.

ఒకసారి స్వామి వివేకానంద తమ అమెరికా పర్యటనలో ఒక యువకుణ్ణి 'ఈ దేశం ఎందుకు వచ్చావు?' అని ప్రశ్నించారు. దానికి ఆ యువకుడు 'చదువుకోవడానికి' అని చెప్పాడు. స్వామి, 'చదువుకుని ఏం చేస్తావు?' అన్నారు. ఆ యువకుడు 'పెద్ద ఉద్యోగం చేస్తాను' అన్నాడు. 'ఉద్యోగం చేసి ఏం చేస్తావు?' అన్నారు స్వామి. దానికాతడు 'చాలా ధనం సంపాదిస్తాను' అన్నాడు. స్వామి 'ధనం సంపాదించి ఏమి చేస్తావు?' అని అడిగారు. 'ఒక మంచి అమ్మాయిని చూసి పెళ్ళి చేసుకుంటాను' అన్నాడా యువకుడు. స్వామి 'పెళ్ళి చేసుకుని ఏం చేస్తావు?' అన్నారు. 'పిల్లలను కంటాను' అన్నాడు అతను. స్వామి 'పిల్లలను కని ఏం చేస్తావు?' అన్నారు. దానికి ఆయువకుడు విసుగు వచ్చి ఏం చెప్పాలో తెలియక 'వృద్ధాప్యం వచ్చి చస్తాను' అన్నాడు. స్వామి 'ఆ చచ్చేదేదో మన దేశంలోనే ఇప్పుడే చావవచ్చుగా, ఇక్కడి దాకా వచ్చి ఎందుకు చావడం?' అన్నారుట.

వివేకానంద స్వామి ఆ మాట ఆ యువకుడి నోటి నుంచి వస్తుందా రాదా అని ఎదురు చూస్తున్నారా. స్వామి తిరిగి మాట్లాడుతూ 'ఈ జీవితం వచ్చింది చచ్చిపోవడానికి కాదు. మనం పుట్టినప్పుడే మన చావు కూడా వ్రాసి పెట్టే వుంది. మృత్యువు రాకాముందే నీ దగ్గర పెద్ద గని వున్నది అని గుర్తించి, చావులేని అమృతత్వస్థితిని సంపాదించుకోవాలి. దాని గురించి ప్రయత్నించు. నువ్వు ప్రయత్నిస్తే సాధించలేనిదేదీ లేదు. ఈనాడు ప్రపంచం అంతా ఇలా ప్రకాశిస్తోంది అంటే అది నీవంటి యువకుల వలనే జరుగుతోంది. నీలో దాగి వున్న ఆత్మవిద్యను గుర్తిస్తే నువ్వు మహామేధావిగా ప్రకాశిస్తావు. అప్పుడు నీ నుండి ఇలాంటి సమాధానం రాదు' అన్నారు.

శ్రీ మాతాజీ తిరిగి మాట్లాడుతూ 'మానవుడికి బంధన నిచ్చేది ఈషణత్రయం. ధనేషణ, దారేషణ, పుత్రేషణ పరమాత్మ సాన్నిధ్యానికి రాకపోవడానికి, తనలో వున్న ఆత్మవిద్యను గుర్తించకపోవడానికి కారణం ఈషణత్రయం. దారేషణ అంటే పక్షులకట, పుత్రేషణ అంటే పశువులకట, ధనేషణ అంటే మానవులకట అని మహాత్ములు చెప్పారు. ఈ మూడూ కూడా మానవుడిని బంధిస్తున్నాయి ఏదో రకంగా.

మానవుడి ప్రవృత్తి ఎలా వుంటుంది అంటే ధనం వస్తోంది అంటే ఎంతటి పని చేయడానికైనా వెనుకాడడు. సంపాదించి దాచుకున్న ధనం ఏమైపోతోందో, ఎక్కడ దాచుకోవాలో తెలియక, ఎవరు ఏం చేస్తారో అనే భయంతో సుఖం లేకుండా జీవితం గడుపుతూ వుంటాడు. ఇవన్నీ ఆకర్షణలే. తాత్కాలిక సుఖాలే. ఇవేవీ నీకు నిజమైన జీవితాన్ని ఇవ్వటం లేదు. నీలో వున్న ఆత్మ బలమే నీకు నిజమైన సుఖాన్నిచ్చేది. నీలో వున్న ఆత్మ శక్తియే నీకు శక్తినిచ్చి నిన్ను ఎంతగొప్పవాణ్ణి చేయాలో చేసి కూర్చోబెడుతుంది. దానికి ధనం భోగభాగ్యాలు అవసరం లేదు.

- సశేషం

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

**జనవరి 2021**

1 శుక్ర - ఆంగ్ల సంవత్సరాది. శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

8 శుక్ర - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

11 సోమ - మాస శివరాత్రి

13 బుధ- అమావాస్య, భోగి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన. రాత్రి 7గం.లకు శ్రీబాబుకు భోగిపండ్లు పోయుట.

14 గురు - సంక్రాంతి - ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

15 శుక్ర - కనుమ.

28 గురు - పుష్య పూర్ణిమ - శ్రీసద్గురుపాదపూజ.

**ఫిబ్రవరి 2021**

2 మంగళ - పుష్య బహుళ పంచమి - శ్రీ త్యాగరాజ స్వామి ఆరాధన.

6 శని - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

10 బుధ - మాస శివరాత్రి.

11 గురు - అమావాస్య.

16 మంగళ - వసంత పంచమి. సరస్వతీ పూజ.

19 శుక్ర - రథసప్తమి

23 మంగళ - భీష్మ ఏకాదశి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ.

27 శని - మాఘపూర్ణిమ - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన.

## చందాదారులకు విజ్ఞప్తి

మీ మాసపత్రిక చందా నెంబరు LM అనే అక్షరాలతో ప్రారంభమయితే మీ చందా గడువు ఇప్పటికే ముగిసినది. అయినా శ్రీగురుదేవుల ఆధ్యాత్మిక సంపద అందరికీ అందజేయాలనే మహదాశయంతో ట్రస్టువారు స్వంత ఖర్చుతో ఇంకా పత్రిక మీకు పంపుతున్నారు. కనుక దయచేసి 1,116 రూలు చెల్లించి మీ చందాను పునరుద్ధరించుకొనవలసినదిగా విజ్ఞప్తి.

# ఉడిపి కృష్ణ మహాత్మ్యం - భోగరాజు భారతీదేవి

కురుక్షేత్ర యుద్ధం జరుగుతున్న సమయంలో ఒక చిన్న సంఘటన జరిగింది. లక్షల కొలది ప్రజలు యుద్ధ వీరులు కౌరవ పాండవ పక్షాలలో చేరిపోయారు. ఎవ్వరూ తటస్థంగా లేరు. కానీ ఉడిపి మహారాజు అలా తటస్థంగా వుండిపోయాడు.

ఆ మహారాజు శ్రీకృష్ణ పరమాత్మతో తాను తటస్థంగా వుండిపోతానని, ఇరుపక్షాల వారికి భోజన సదుపాయం చేస్తానని చెప్పాడు. కృష్ణ పరమాత్మ 'సరే అలాగేలే. కొంతమంది వండుతారు, కొంతమంది వడ్డిస్తారు. అలాగే చెయ్యి' అన్నాడు.

సైన్యం అయిదు లక్షల మంది. రోజుకు కొంతమంది చనిపోతూ వుంటారు. అంతమందికీ వంట చేస్తే అది రోజూ వృథా అయిపోవచ్చు. అలా అని తక్కువ వండితే ఒకవేళ అది చాలక పోవచ్చు అనుకున్నారు చాలామంది.

కానీ, ఉడిపి మహారాజు చాలా తెలివిగా, ఆశ్చర్యకరంగా ఏ రోజుకారోజు సరిగ్గా ఎంతమంది వున్నారో అంతమందికే వండించేవాడు. అది సరిగ్గా సరిపోయేది. ఏ ఒక్కనాడు కూడా ఎక్కువ అవ్వలేదు, తక్కువ అవ్వలేదు. వృథాపోయేది కాదు. రోజుకు ఎంతమంది చనిపోతారో, ఎంతమంది మిగులుతారో ఎవ్వరికీ తెలియదు. మరి అంత కరెక్టుగా ఎలా వండించగలుగుతున్నాడు అని అందరూ చాల ఆశ్చర్యపోయి ఆయనను అడిగారు.

దానికి సమాధానంగా ఉడిపి మహారాజు మాట్లాడుతూ 'నేను రోజూ రాత్రిపూట శ్రీకృష్ణుడి దగ్గరకు వెళ్ళేవాడిని. రాత్రిపూట ఆయన ఉడకబెట్టిన వేరుశెనగపప్పులు తింటాడు అని తెలిసి, రోజూ నేను కొన్ని పప్పులు లెక్కపెట్టి ఉడికించి తీసుకువెళ్ళేవాడిని. ఆయన నేను తీసుకెళ్ళిన వాటిలో కొన్నింటిని మాత్రమే తినేవాడు. మిగిలినవి నేను మరల లెక్కపెట్టేవాడిని.

ఉదాహరణకు కృష్ణుడు పది పప్పులు తింటే 10 వేలమంది ఆ రోజు చనిపోయారని అర్థమయ్యేది. ఆ విధంగా వంట చేయించేవాడిని. కృష్ణ పరమాత్మ ఏనాడూ కూడా ఆందోళనగాని, అశ్రద్ధగానీ చూపేవాడు

కాదు. ఈ విధంగా శ్రీకృష్ణపరమాత్మ ఉడిపి ప్రజలకు ఈ విధమైన వంటచేయడం అనే పనిని ఇచ్చి దీవించాడు అని భావించుకుని వారిలో ఎక్కువ మంది ఆ పనినే ఇప్పటికీ వంశాచారంగా చేస్తూ వుంటారు. ఇది ఉడిపి ప్రాంతంలో ప్రచారంలో వున్న కథ.

గృహ కృత్యాలు నిర్వర్తిస్తూ, స్వధర్మాన్ని నెరవేరుస్తూనే మానవుడు భగవానుని యందు విశ్వాసం పెంచుకోవాలి. పూజించలేక పోయినా, ధ్యానించలేక పోయినా భగవంతుని యందు అచంచల విశ్వాసాన్ని నిలుపుకుంటే చాలు. ఆ విశ్వాసమే ధ్యానమై, అదే తపస్సు అయి, మనస్సు గాలిలేని దీపం వలె నిలుస్తుంది. దుర్గుణాలను జయించే మహత్తర శక్తి వస్తుంది. ఆ భగవద్విశ్వాసమే సత్వ రజస్తమో గుణాలను సత్య శివ సుందర స్వరూపంగా మారుస్తుంది.

-శ్రీశ్రీశ్రీ బాబూజీ మహరాజ్

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా జనవరి, మరియు ఫిబ్రవరి 2021 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***జనవరి 2021 :*** AS 6169, 6990, 7000, 7217, 7218, 7420, 7987, 8505, 8509, 8510, 8512, 6373, 7208. 5127, 8517.

***ఫిబ్రవరి 2021 :*** AS 5475, 7221, 7229, 7231, 7232, 7367, 7998, 7999, 8518, 8520.

# శ్రీ నృసింహ యోగీంద్రులు

- మురళి

1914వ సం. ఆశ్వీయుజ బహుళ త్రయోదశి రోజున తూర్పు గోదావరి జిల్లా, ముంగండ గ్రామంలో తమ మాతామహుల ఇంటి వద్ద జన్మించారు లక్ష్మీ నరసింహమూర్తి. తండ్రి లక్ష్మీనారాయణ, తల్లి సీతమ్మ రాజోలు తాలూకా గంటి గ్రామ వాస్తవ్యులు. నృసింహ మూర్తి బాల్యంలో చాలా అల్లరి చేసేవారు. తాతగారైన నృసింహంగారు పిల్లవాడిని క్రమశిక్షణలో పెట్టే ప్రయత్నం చేసేవారు. బాలుని ఎనిమిదవ సంవత్సరంలో ఉపనయనం చేయడంతో వేదాధ్యయనం మొదలు పెట్టారు.

అప్పట్లో స్వతంత్ర ఉద్యమం ఉధృతంగా జరుగుతుండేది. నృసింహ మూర్తి కూడా ప్రభావితులై శ్రీ అల్లూరి సీతారామరాజు గాధలు విని ఉత్తేజితులై, వారివలె సిద్ధ పురుషుల వద్ద సాధన చేసి, అలౌకిక శక్తులను సముపార్జించుకుని బ్రిటీష్ వారిని ఎదుర్కొనవలెనని వువ్విళ్ళూరేవారు. తన పదవ సంవత్సరంలోనే ఇల్లు విడిచి అన్నవరం చేరుకున్నారు. తాతగారికి ఈ విషయం తెలిసి అక్కడకు వెళ్ళి ఇంటికి తీసుకుని వచ్చారు. తరువాత కొంత కాలానికి మరలా ఇంటి నుంచి వెళ్ళిపోయి గుంటూరు చేరుకుని సంస్కృతం అభ్యసించటం మొదలు పెట్టారు. ఈసారి కూడా తాతగారు వచ్చి ఇంటికి తీసుకువెళ్ళి, కాపలాకు ప్రత్యేకంగా ఒక వ్యక్తిని నియమించారు. అల్లూరి సీతారామరాజు గారు కూడా సిద్ధపురుషుల వద్దనే కదా మహిమలు నేర్చుకున్నది. అటువంటి మహాత్ములు హిమాలయాలలో తప్పక వుంటారని నమ్మి, తన 14వ ఏట గంటి గ్రామంలోని తమ ఇల్లు వదలి, గోదావరి నది ఈదుకుని దాటి, తణుకు చేరుకున్నారు. అక్కడి నుంచి ఉత్తర భారతదేశం వైపు ప్రయాణం సాగించారు. రైలులో ప్రయాణిస్తుండగా పరిచయమైన మార్వాడీ దంపతులు తమతో హరిద్వార్ తీసుకు వెళ్ళారు. సంతానంలేని ఆ మార్వాడీ దంపతులు నృసింహమూర్తిని ఎంతో ప్రేమతో చూసుకునేవారు.

నృసింహమూర్తి మార్వాడీ దంపతుల వద్దనే వుంటూ శాస్త్రముల అధ్యయనం మొదలు పెట్టారు. బదరీనాథ్ వెళ్ళే భక్తులతో కలసి బదరీ వెళ్ళారు. అక్కడ స్వామి దర్శనం చేసుకుని, అలకనందా నదీ తీరంలో

మహాత్ముల దర్శనం అవుతుందని భావించి, నదీతీరం వెంట ఎన్నో కష్టాలకు, శ్రమకు ఓర్చి నడక సాగించారు. పగలంతా నడక, రాత్రికి ఏదైనా చెట్టు పైకి ఎక్కి నిద్రించడం, ఈ విధంగా ఒక వారం రోజులు ప్రయాణించిన తరువాత 'శతోపథం' అనే ప్రదేశం చేరుకున్నారు. పాండవులు ఇక్కడ నుంచే స్వర్గారోహణ చేశారని ప్రతీతి. ఈ పర్వత శ్రేణులలో ప్రయాణించడం అత్యంత కష్టంతో కూడుకున్న పని. అయినా అవన్నీ భరిస్తూ ముందుకు సాగారు. ఒక రోజు రాత్రి ఒక చెట్టుపైకి ఎక్కిన నృసింహమూర్తికి దూరంగా ఒక మంట కనిపించింది. అక్కడ జనసంచారం తప్పక వుంటుందని భావించి ఆ రాత్రికిరాత్రే రాళ్ళు రప్పలు చూసుకోకుండా నడిచి అక్కడకి చేరుకున్నారు.

ఒక కొండ గుహముందు విశాలమైన ప్రదేశంలో మంట వద్ద ధ్యాన ముద్రలో వున్నారు శ్రీ సర్వానంద అవధూత. వారిలో నుంచి అద్భుతమైన తేజస్సు వెలువడుతోంది. నృసింహమూర్తి వారి వైపే చూస్తూ వారి ఎదురుగా పద్మాసనంలో కూర్చున్నారు. కొంతసేపటికి తెల్లవారింది. శ్రీ సర్వానందులలో ఎటువంటి చలనమూ లేదు. బాల నృసింహమూర్తి స్నానాదులను ముగించుకుని, దొరికిన పండ్లు ఆహారంగా తీసుకుని మరల స్వామి ఎదుట కూర్చున్నారు. మూడు రోజులు వరుసగా ఇదే విధంగా జరిగిపోయాయి. నాలుగవ రోజు స్వామి బిగ్గరగా మరియు దీర్ఘంగా ఓంకారం పూరిస్తూ కళ్ళు తెరిచేసరికి ఎదురుగా కూర్చున్న బాల నృసింహమూర్తిని చూసి 'బాలకా! ఎవరు నువ్వు?' అని అడిగారు. నృసింహమూర్తి తన గాథను స్వామికి తెలియజేశారు. అంతట అవధూత స్వామి 'నీ యోగక్షేమాలు తెలియక, నీ తల్లిదండ్రులు, నీ తాతగారు ఎంతగా దుఃఖిస్తున్నారో, ఇంటికి వెళ్ళి వివాహం చేసుకుని, వారి వద్దనే వుంటూ వారిని ఆనందింపజేయి' అన్నారు. అంతట నృసింహమూర్తి 'మీ వంటి మహాత్ముల సేవ చేసుకుని తరించాలని నా కోరిక. ఒకప్పుడు సిద్ధులు సాధించి స్వతంత్ర ఉద్యమంలో పోరాడాలని వుండేది, కానీ ఇప్పుడు ఆ కోరిక లేదు. తమరు నన్ను అనుగ్రహించండి స్వామీ!' అని స్వామి పాదాలపై వాలిపోయాడు.

- సశేషం

# సమర్థ సద్గురు నాధుని దివ్య చరిత్ర

## శ్రీహరిరావు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

శివరాత్రి రోజున రాజమండ్రిలోనే ఉన్నారు. శ్రీ బాబుకు జ్వరంతో బాటు 'పొంగు' (చిన్న అమ్మవారు) వచ్చింది. స్నానం చేయవద్దని డాక్టర్లు చెప్పినా రోజూ స్నానమూ పూజా మామూలుగానే చేసుకుంటున్నారు. ఎక్కడికీ కదల రాదని డాక్టర్లు వారిస్తున్నా కారులో ఆ ఊరూ, యీ ఊరూ వెళ్ళి వస్తూనే ఉన్నారు. 'అదేమిటి బాబూ! ' అంటే , "అమ్మ ఒడిలోనే పడుకున్న వాడికి 'అమ్మవారు' రావటం, పోవటం ఏమిటి? " అన్నారు.

29-3-1960: రాజమండ్రిలో కాళీ జయంతులు ప్రారంభమైనాయి.



14-7-1960: శ్రీబాబు ముంజవరపుకొట్టుకు వెడుతున్నారు. వర్షం వలన బండి ఊరు దాకా వెళ్ళదని ముంగండ నుంచి వర్షంలో, బురదలో నడిచి ముంజవరపుకొట్టు చేరారు. "ఈ సాయంత్రం ప్రళయం వస్తుందని అందరూ చెప్పుకుంటున్నారు. మనం ఆ ప్రణవ స్వరూపుణ్ణి తలుచుకంటూ కూర్చుందాము. ప్రళయంలో మునిగినా, ప్రణయంలో మునిగినా వాడితోనే ఉందాము. అని సాయంత్రం 7గంటల నుండి 10గంటల వరకు దివ్యమైన బోధను అందిస్తూ "పరమేశ్వరుణ్ణి నమ్ముకున్న వాడు ప్రళయమైనా, ప్రణయమైనా చలించడు. అదే దైవ బలం. దేశము, కాలము, సృష్టి, సృష్టికర్త అన్నీ దానికి లోబడినవే" అని చెప్పారు.

20-10-1960: దీపావళి పండుగ. శ్రీ బాబుతో భీమవరం తాతయ్య గారింట్లో భక్తులందరూ కలిసి పండుగ చేసుకున్నారు.

26-10-1960: శ్రీ బాబు స్నానము, పూజ ముగించుకుని శ్రీరామం (పరశురామయ్య గారి కుమారుడు) గారితో కలిసి వడాలి వెళ్ళారు. వెడుతూ "బలరామ సహితుడై మేనమామలను చూడటానికి వెడుతున్నాడు వీడు" అన్నారు. (పరశురామయ్యగారి బావమరదులు

ముగ్గురు - వారణాసి సుందర రామయ్య గారు, లక్ష్మీ నరసింహం గారు, సీతారామయ్య గారు - వీళ్ళు చుక్కమ్మ గారి సోదరులు) రాత్రి 2 గంటలకు తిరిగి వచ్చి, అక్కడి విశేషాలు యిలా చెప్పారు.

"మా మేనమామలు ముగ్గురూ కొంతకాలం నన్ను సరిగా అర్థం చేసుకో లేదు. అయినా, 'నాన్నగారి' బావమరదులుగా వాళ్ళను నేను గౌరవిస్తూ, వాళ్ళకు చేయవలసినదేదో చేస్తూనే ఉన్నాను. ఇప్పుడిప్పుడు కొంచెం అర్థం చేసుకుని పశ్చాత్తాపంలో పడ్డారు. భక్తి మరీ ఎక్కువై ఒకటి చేయబోయి మరొకటి చేశారు. తప్పు చేశామని గ్రహించటం వలన మానవుడు మంచి దోవలో అడుగు పెడతాడు. కాని ఆ దోవలో ముందుకు సాగవలెనంటే, మళ్ళీ ఆ తప్పు చేయకుండా ఉండాలి" అన్నారు.

29-10-1960 : శ్రీబాబు సాయంకాలం వరండాలో కూర్చుని భీమవరం తాతయ్యగారి కుమార్తె శేషమ్మగారితో పద్యాలు పాడించుకున్నారు. ఒక పద్యంలో, విదురుడు శ్రీకృష్ణునితో, "కృష్ణా! కృష్ణాష్టమి, శ్రీరామనవమి, విజయదశమి, కార్తీక పూర్ణిమ, పితృదేవతల ఆగమనము యిలా అన్ని పర్వదినాలు ఒకేసారి వస్తే, ఎంత ఆనందంగా ఉంటుందో, నీవు రావటం వలన నాకు అంతకంటె ఎక్కువ ఆనందంగా ఉంది" అన్నట్లుగా ఉన్నది. అది విని శ్రీ బాబు "నిజమే! మనవాడు అలాటి వాడే! కేవలానంద స్వరూపుడు గదా!" అన్నారు.

4-11-1960 : రాత్రి 9 గంటలకు శ్రీ బాబు శ్రీహరిగారింటికి వచ్చారు. వెంట మావులేటి ఈశ్వరరాజు గారున్నారు. శ్రీ బాబు "బ్రహ్మానందం ఎలా ఉంటుంది?" అని అడిగి, తామే ఎదురుగా గోడమీద ఉన్న క్యాలెండరు చూపిస్తూ "ఆవు వద్ద నిలబడి గుమ్మపాలు త్రాగుతున్న ఆ కృష్ణుని ముఖంలోని ఆనందమూ, 'నా ప్రభువుకు యిలా క్షీరాన్ని అర్పించుకోగలిగా'నని ఆ గోవు ముఖంలోని ఆనందమూ, "యిప్పటిదాకా తాగనని మారాము చేసిన నా కన్నయ్య యిప్పుడైనా పాలు తాగుతున్నాడుగదా' అని యశోదమ్మ ముఖంలో తొంగిచూసే ఆనందమూ, యిదంతా నేను వర్ణించి చెబుతుంటే మీ ముఖాలపై తాండవించే ఆనందమూ, యిలా సర్వత్రా వెల్లివిరిసే ఆనందాన్ని చూసి వీడు పొందే ఆనందమూ - యిదే బ్రహ్మానందము! ఆనంద స్వరూపుడు ఎక్కడ ఉంటే అక్కడంతా బ్రహ్మానందమే గదా!" అన్నారు.

-సశేషం

(గత సంచిక తరువాయి) విష్ణు  కథలు -రమణ ప్రసాద్

# అవధూత పిచ్చమ్మ

"ఓసి పిచ్చిముండా! వీడికి అప్పుడేమి తెలుసే? అప్పుడు తెలుసా వీడికి దేవుడు కనపడతాడని? అంతా ఆ రాముడు నడిపితే నడిచాడు వీడు" అన్నది పిచ్చమ్మ. అమ్మ ఊహలు నిజమయ్యాయి. ఆమెకు ఆడపిల్ల కలిగింది. భర్త పరలోకగతుడయ్యాడు. ఆ పసిగుడ్డును తీసుకుని పుట్టింటికి వచ్చింది. ఆ పసిదాని పేరు భాగ్యం.

తల్లి వీరమ్మ పిచ్చమ్మకు మారు మనువు చేస్తాననంటే'. నువ్వు తల్లివి కనక కనికరించాను. ఇంకొకరైతే గండ్రగొడ్డలితో ముక్కలు ముక్కలుగా నరికేసేదాన్ని" అంది. పిచ్చమ్మకు భాగ్యమే ఇహలోక భాగ్యం అయింది. భాగ్యం పెద్దదయ్యేసరికి నాలుగు రాళ్ళు వెనకెయ్యాలి. కూతురు పెళ్ళి ఘనంగా జరిపించాలని ఇద్దరు చేసే పని ఒక్కత్తే చేసేది. కామందులంతా 'మాపనిలోకి రా!' అంటే 'మా పనిలోకి రా!' అని పోటీ పడేవారు. పిచ్చమ్మ ముఠా మేస్త్రీ అయింది. తను ధర్మంగా నడిచి, అందరినీ ధర్మంగా నడిపేది. ఆవెంది సుగ్రీవాజ్ఞ! ఆ రోజుల్లో కూలి నాలుగణాలు. నాలుగు రాళ్ళ పోగవుతున్నాయి. "వీడు వడ్డీలకిచ్చేవాడు. పాపపు వడ్డీలకు పోయేవాడు కాదు." అని చెప్పింది.



తన ఆధ్యాత్మిక అనుభవాలను ఇలా చెప్పింది: దశవిధనాదాలు వినబడుతూనే ఉండేవి. బాల దర్శనమవుతూఉండేది.పొలం వెళ్తుంటే, వీడి వెంట వచ్చేది. అమ్మ ఈ మాయ బొమ్మతోటి నువ్వెందుకు? అని ఊరవతల చెరువు ప్రక్క వేపచెట్టు మీద అమ్మను కూర్చోబెట్టి వీడు పొలం లోకి వెళ్ళేవాడు. తిరిగి వచ్చేటప్పుడు బాల వెంటవచ్చేది. పిచ్చమ్మ ఊళ్ళో ఉన్న అన్న కొడుక్కి భాగ్యనిచ్చి పెళ్ళి చేసింది. మూణ్ణాళ్ళ ముచ్చటగా భాగ్యం బొట్టు రాలిపోయింది. తల చెడిన కూతురిని దగ్గరపెట్టుకుని కాలం ఈడుస్తోంది.భాగ్యానికి మళ్ళీ పెళ్ళి చెయ్యాలనుకొంది. భాగ్యాన్ని కపిలేశ్వరం తీసుకువెళ్ళి అక్కడ మూడు ముళ్ళు వేయించింది. పిచ్చమ్మ అల్లుణ్ణి ప్రేమగాచూసుకునేది. అల్లుడు

వచ్చినప్పుడల్లా రాచమర్యాదలు చేసి గుప్పెడు రూకలిచ్చి పంపేది. అదేమి దురదృష్టమో! ఆమె అల్లుడు భార్య మీద కస్సు బుస్సుమనేవాడు. భాగ్యం భోరున ఏడుస్తూ కన్నతల్లి దగ్గరకు వచ్చి పడేది. మంచిమాటలు చెప్పి డబ్బు ఇచ్చి కాపరానికి పంపేది. ఇలా అనేకసార్లు జరిగింది.

ఒకసారి భాగ్యం 'నేను అత్తవారి ఇంటికి వెళ్ళను" అని వలవల ఏడ్చింది. కూతురికి నచ్చచెప్పి కాపురానికి పంపింది. పిచ్చమ్మకి భాగ్యం నూతిలో పడ్డట్లు కల వచ్చింది. భాగ్యం కనపడటంలేదని కబురు వచ్చి కపిలేశ్వరం వెళ్ళింది. సూటిగా పెద్దనూతి దగ్గరకు వెళ్ళింది. నూతిగట్టున చెంబు ఉంది. పిచ్చమ్మ నిలువునా కూలిపోయింది. "భాగ్యం దోసిటలోఅత్త నిప్పులు పోసింది. ఆ తర్వాత ఏమయిందో మాకుతెలియదు" అన్నారు అక్కడివారు. కొంతసేపటికి పోలీసులు వచ్చి "నీకు ఎవరిమీద అనుమానం ఉందో చెప్పు"అన్నారు. "నా బిడ్డకు మూర్ఛరోగం ఉంది. అందువల్ల నూతిలో పడి ఉంటుంది" అని చెప్పింది ఎవరిమీదా పెట్టకుండా.

ఊళ్ళోకి వెళ్ళకుండా కురుమద్దాలికి తిరిగి వచ్చేసింది. పిచ్చమ్మ ఎప్పుడూ భాగ్యం స్మరణలో కాలం గడుపుతోంది. ఇలా రోజులు, నెలలు, సంవత్సరాలు గడిచాయి.

ఒకనాటి రాత్రి రోడ్డుమీద ఒక గోసాయి వచ్చి అక్కడివారితో"నేను నిరుడు వచ్చాను. మళ్ళీ ఇప్పుడు వచ్చాను. ఈ గుడిసెలో నుండి ఒకటే ఏడుపు అప్పుడూ ఇప్పుడూ వినబడుతోంది ఏమిటి?" అని అడిగాడు. వారు పిచ్చమ్మను గురించి చెప్పారు. "నేను లోపలికి వెళ్లి మాట్లాడచ్చా?" అని అడిగారాయన. "ఓ తప్పకుండా!" అన్నారు అక్కడివారు. గోసాయి పిచ్చమ్మ గుడిశలోకి వెళ్ళి అరగంట ఉండి తన దారిన తాను పోయాడు. వాళ్ళిద్దరూ ఏం మాట్లాడుకున్నారో ఆ పరమేశ్వరుడికే ఎరుక!

పిచ్చమ్మ జీవితంలో మార్పు వచ్చింది. ఇల్లు వదిలేసింది. రుద్రభూమిని నివాసంగా చేసుకుంది. మృత్యుంజయుడే ప్రత్యక్షమయి, మృత్యుంజయాన్ని ఆమెకు వరంగా ఇవ్వాలి అని నిశ్చయించుకుంది. ఆమెకు మంత్రం లేదు. తంత్రం లేదు. ధ్యాన ప్రక్రియ లేదు. ఆత్మ విచారణ అసలే లేదు. ఒట్టి ఏడ్పు! ఒట్టి ఏడ్పు! పరమాత్మకు ఆమె పెట్టుకున్న పేరు రాముడు

-సశేషం

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD